www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 4 జనవరి 2025

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ

పరుగు పందెంలో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప నగర శివారులోని డిటిసిలో నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ నాలుగో రోజు శుక్రవారం కొనసాగింది. అభ్యర్థులకు 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 713 మంది మహిళా అభ్యర్థులకు గాను 345 మంది పరీక్షలకు హాజరయ్యారు. 195 మంది క్వాలిఫై అయ్యారు. మహిళా అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలను నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి బి.రమణయ్య, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఐటి కోర్ టీమ్, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి కాలేజీ బువ్వ

- 24 కళాశాలల్లో అమలుకు శ్రీకారం
- 6,223 మంది విద్యార్థులకు ప్రయోజనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం నుండి మధ్యాహ్నం భోజనం అందించనున్నారు. ఈ పథకాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజయవాడలో ప్రారంభించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ప్రభుత్వం అధికారికంగా ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన జిఒను విడుదల చేసింది. పేదరికం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్యం అన్ని విధాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ మధ్యాహ్న భోజనం పథకాన్ని తీసుకున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలలో ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నారు. తమకు మధ్యాహ్న భోజన పథకం ఎప్పుడు అమలు చేస్తుందో అని ఎదురుచూస్తున్న ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది.

భోజన ఏర్పాట్లు ఇలా...

జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. వీటిలో ఉన్న మొత్తం 6,223 మంది విద్యార్థులకు పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. వీరిలో 3,100 మంది ప్రథమ, 3,123 ద్వితీయ విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్న భోజనం అమలవుతోంది. జిల్లాలో ఉన్న 1,32,841 మందికి విద్యాశాఖ అధికారులు భోజనం అందిస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలను మధ్యాహ్న భోజన కార్మికులుగా నియమించి వారితో ఆహార పదార్థాలను తయారు చేయిస్తున్నారు. ఇప్పుడు వీరితో పాటు అదనంగా ఆహార పదార్థాలను తయారు చేయించి, కళాశాలకు సరఫరా చేయనున్నారు. జిల్లాలో 24 కళాశాలలకు సమీపంలో ఉన్న పాఠశాలల ద్వారా అందించనున్నారు. ఇందులో 5 కళాశాలలకు ఇస్కాన్ ఫౌండేషన్ అనే సంస్థకు అప్పచెప్పగా మిగిలిన 19 కళాశాలలకు హైస్కూల్‌లోనే ఎవరైతే వంటను తయారు చేస్తున్నారో వారి ద్వారా భోజన పదార్థాలను సరఫరా చేయనున్నారు.

ఇంటర్ విద్యార్థులకూ అదే మెనూ..

పాఠశాలల్లో వండిన ఆహార పదార్థాలనే కళాశాలలకు అందిస్తుండడంతో అదే మెనూ వారికీ ప్రస్తుతానికి అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వారానికి ఐదుసార్లు గుడ్డు, సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కి, మంగళ, గురు, శనివారాల్లో రాగి జావ అందించనున్నారు.

రోజువారీ మెనూ జాబితా...

సోమవారం : వేడి పొంగలి, ఉడికించిన గుడ్డు లేదా వెజిటబుల్ పలావు, కోడి గుడ్డు కూర, వేరుశనగ చిక్కీ **మంగళవారం :** పులిహోరా, దొండకాయ చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ, **బుధవారం :** వెజిటబుల్ రైస్, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ, **గురువారం :** సాంబారు అన్నం లేదా లెమన్ రైస్, టమాట చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ, **శుక్రవారం:** అన్నం, ఆకుకూర, పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, **శనివారం :** ఆకుకూరలతో భోజనం, పప్పుచారు, స్వీట్ పొంగలి, రాగి జావను వడ్డిస్తారు.

హాజరు శాతం పెరుగుతుంది

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మధ్యాహ్న భోజనం పథకం చాలా మంచిది. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పిల్లలకు చాలా ఉపయో గకరంగా ఉంటుంది. గతంలో మా కళాశాలలో 60, 70 శాతం మార్కులు విద్యార్థులు సాధించేవారు. ప్రస్తు తం 80 శాతానికి పెరుగుతాయి. రాబోయే రోజులలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు శాతం, అడ్మిషన్లు,అదిక మార్కులు విద్యార్థులు సాధిస్తారు.

- శంకరయ్య, ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రాయచోటి.

అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు అందరికీ ప్లేట్లు గ్లాసులు కూడా సరఫరా చేస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన భోజనాన్ని అందిస్తాం. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తాం.

- కృష్ణయ్య, డిఐఒ, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

జిఒ 36ను అమలు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36ను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బండ్లమూడి వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మానవహారం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు ఏడు సంవత్సరాల నుండి వేతనాలు పెంచలేదని తెలిపారు. 15 నుండి 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్నా కేవలం రూ.15 వేల వేతనంతో పనిచేస్తున్నారని చెప్పారు. పెరిగిన ధరలకనుగునంగా కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేసి హెల్త్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రంను మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు అందజేశారు. కార్యక్రమంలో జె.శంకరయ్య, ఇంజినీరింగ్ కార్మికులు దేవా, మల్లికార్జున, ఖాదర్‌వలి, శ్రీనివాసులు, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమేష్, రమణ, రెడ్డి ప్రసాద్, అక్బర్, షకీల్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మున్సిపల్ కార్మికులకు జిఒ నెంబర్ 36 అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలు రవికుమార్ డిమాండ్ చేశారు. పురపాలక కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా 10 నుండి 20 సంవత్సరాల వరకు పనిచేస్తున్న మున్సిపల్ ప్రాథమికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, వారికి ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మున్సిపాలిటీలో పనులు పెంచాలని, చాలామంది కార్మికులు పిఎఫ్ జమకాక ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, ఎం.రమణ, యానాదయ్య, రవిశంకర్ పాల్గొన్నారు.

రాయచోటి : మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

రాజంపేట : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని జాయింట్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. రైల్వే కోడూరు మండలం సెట్టిగుంట గ్రామంలో శుక్రవారం తాసిల్దారు మహబూబ్‌చాంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ సెట్టిగుంట గ్రామానికి చెందిన ప్రజలనుంచి వివిధ రెవెన్యూ సమస్యలను స్వయంగా తీసుకొని పరిష్కారం చూపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, ప్రజలందరూ వీటిని ఉపయోగించుకొని వారి రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా చేసేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహి స్తున్నట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులలో తహశీల్దార్ విఆర్‌ఒ, సర్వేయర్, ఎండోమెంట్స్, అటవీ, తదితర శాఖలకు చెందిన అధికారులు అందరూ పాల్గొని పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తు న్నామని అన్నారు. ఏ గ్రామంలో అయితే సదస్సు నిర్వహించబడుతుందో ఆ గ్రామ ప్రజలు రెవెన్యూ సదస్సును వినియోగించుకొని తమ భూ సమస్యలను పరి ష్కారం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కారం చేయడమే కాకుండా రెవెన్యూ సేవలను ఉచితంగా అందిస్తు న్నామని, వాటిని కూడా సదస్సు జరిగే రోజు వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయలు, ఆర్‌ఐ లక్ష్మీదేవి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** భూ సమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ అరవింద్ కిషోర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవసముద్రం గ్రామంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ద్వారా భూ సమస్యలు పరి ష్కారం అవుతా యని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులో అధికంగా మ్యుటేషన్, పెన్షన్, రేషన్ కార్డులు కోసం దరఖాస్తులు వస్తు న్నాయని చెప్పారు. దేవసముద్రం రెవెన్యూ సదస్సులో 106 దరఖాస్తులు రావడం జరిగిందని అందులో రెవెన్యూ 37, పెన్షన్ 44, రేషన్ కార్డులు 13, దేవాదాయ శాఖ 2, గృహ నిర్మాణం7, ఎంపిడిఒ2, సర్వే కోసం 1 రావడం జరిగిందని పేర్కొన్నారు. కార్య క్రమంలో ఆర్‌ఐ సుశీల్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీరాములు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రభుత్వం గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవా లని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. మండలంలోని ఓదివీడు పంచాయతీ కస్పా గ్రామంలో తహశీల్దార్ శ్రావణి ఆధ్వర్యంలో జరుగు తున్న రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపిహయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రైతులకు ఏ సమస్య వచ్చినా రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని, తక్షణమే రైతుల పొలాలకు చెందిన సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజల నుంచి భూ సంబందిత సమస్యలపై వినతులు స్వీకరించి త్వరితగ తిన పరిష్కరించాలని తహ శీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మండల సర్వే సులోచన, విఆర్‌ఒ ప్రేమ సాగర్, పంచాయతీ సెక్రటరీ శ్రీ పద్మజ, సచివాల సిబ్బంది, మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు, మట్లి సర్పంచ్ నాగార్జున ఆచారి, మాజీ సర్పంచ్ వెంకట రామరాజు, సీనియర్ నాయకులు నందకుమార్ నాయుడు, మల్లికార్జున భూషయ్య నాయుడు, సిద్దిరాజు, టిడిపి మహిళా అధ్యక్షులు నాగసుబ్బమ్మ, బిసి నాయకులు చలపతి, సుధాకర్, రామ చంద్ర, ఆంజనేయులు రెడ్డి, దుర్గం ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు చేపట్టిందని స్థానిక తహశీల్దార్ పామిలేటి అన్నారు. మండలంలోని జర్రావారిపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామంలో భూ సమస్యలు ఉన్న వారు పరిష్క రించుకోవడానికి ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ దేవాదాయశాఖ భూములను ఆక్రమిం చుకు న్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో రీసర్వే డిటి వెంకట్, ఆర్‌ఐ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వలిగట్ల వెంకట్రమణ, సర్పంచ్ మునిభాస్కర్, రైతులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

వీరబల్లి : రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

కళాకారులతో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా

వినతులు స్వీకరించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి - కడప

వివిధ కుల సంఘాల నాయకుల నుండి ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అభిప్రాయాలను, వినతులను స్వీకరించారు. షెడ్యూలు కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కడప జిల్లాకు రాజీవ్ రంజన్ మిశ్రా వచ్చారు. కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. విద్యా, ఉద్యోగాల పరంగా, వివిధ రకాల ప్రభుత్వ పథకాల పరంగా లబ్ధిపొందుతున్న షెడ్యూల్ కులాల లబ్ధిదారుల వివరాలను తెలుసుకుని ఆయా శాఖల అధికారులతో రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడారు. అనంతరం వివిధ కుల సంఘాల నాయకులు నుండి అభిప్రాయాలను, వినతులను స్వీకరించారు. చైర్మన్‌తోపాటు అభిప్రాయాలు, వినతులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, జెసి అదితిసింగ్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి స్వీకరించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిప్రాయ సేకరణ, వినతులు స్వీకరణ కొనసాగింది.

'మిట్స్'లో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్, స్పోర్ట్స్ వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో అశ్వ 2025-జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ వెబ్‌సైట్, ప్రమోషనల్ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ ఆవిష్కరించారు. ప్రతి ఏటా కళాశాలలో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో విద్యార్థులకు వివిధ పోటీలను టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ విభాగాలలో నిర్వహిస్తామని, 2025 సంవత్సరం ఫిబ్రవరి 21, 22వ తేదీలలో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలు కళాశాల అశ్వ వెబ్ సైట్ www.ashv2k.in, www.mits.ac.inలో పొందుపరిచామని పేర్కొన్నారు. ఈ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు, పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని, ఈ కార్యక్రమం లో ప్రతి ఏటా సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారని, ఈ సారి కూడా సినీ నేపథ్య గాయకులు, తారలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల అశ్వ-2025 కన్వీనర్, వైస్ ప్రిన్సిపల్ కమాల్ బాషా, కో- కన్వీనర్ ప్రదీప్ కుమార్ స్టూడెంట్ కో-ఆర్డినేటర్స్ జగన్ మోహన్‌రెడ్డి, సుశాంత్, పవన్, వంశీధర్ రెడ్డి, హారిక, హర్షిత పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎపిసిపిఎస్ఇ సంఘ ఉద్యోగులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గృహం వద్ద వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎపిసిపిఎస్ఇ రాష్ట్ర ఉపాధ్యక్షులు సౌరకాయల శ్రీనివాసులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ రంజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ 2004, సెప్టెంబర్, 1 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత వృద్ధాప్య పెన్షన్ కంటే తక్కువ వస్తోందన్నారు. ఆ పెన్షన్‌తో వృద్ధాప్యంలో ఏ విధంగా బతకేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్‌ను రద్దు చేయడంతో ఈ ప్రభుత్వంలో మాకు మేలు జరుగుతుందనే గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని 164 సీట్లతో గెలిపించామని రంజిత, రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సిపిఎస్ స్థాయి ఉద్యోగులకు బకాయి ఉన్న డిఎ, పీఆర్సీలను విడుదల చేసే విధంగా సిఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటి రవీంద్ర, ఈశ్వరయ్య, రెడ్డిఖాషా, కిల్లా నాగరాజు, నరేష్, జయంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని బాలసదన్ విద్యార్థులకు ఎమ్మెల్యే అకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం పండ్లు, కేకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు దైవంతో సమానమని, అనాథలైన వారిని బాగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాపినేని విశ్వనాథ్ రెడ్డి, అమరా, దండు గోపి, గంగా కళ్యాణ్ కుమార్ రెడ్డి, సోమ బత్తిన శ్రీనివాసులు, ఇసుకపల్లి రెడ్డియ్య, నీలకంఠ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలందరిలో న్యాయవ్యవస్థ పట్ల రాజ్యాంగం, చట్టాల పట్ల పరిజ్ఞానం పెరిగేటట్లుగా ఐఎఎల్ కృషి చేయాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుసారం న్యాయ విజ్ఞాన సదస్సులు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయని అయినప్పటికీ ప్రజల్లో చట్టాల పట్ల, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కుల పట్ల మరింతగా విజ్ఞానం పెరగాల్సిన అవసరం ఉందని ఐఎఎల్ లాంటి సంస్థలు ముందుకు వచ్చి ప్రజల్లో న్యాయ పరిజ్ఞానాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్‌కుమార్ పి.రెడ్డయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.నాగముని, పిపి జగన్మోహన్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పారిశుధ్య కార్మికులు

మదనపల్లె జిల్లా ఆస్పత్రి ఆవరణలో ప్రమాదం అంచున పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో 11 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. లోనికి ఎవ్వరికి అనుమతి ఉండదు. అలాంటి చోట విద్యుత్ సరఫరా నిలిపి వేయకుండానే గడ్డి, ముళ్ళ చెట్లు తొలగించడానికి శుక్రవారం మహిళా పారిశుధ్య కార్మికులను లోనికి పంపి పనిచేయించారు. జరగరానిది జరిగితే భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఆ ప్రదేశానికి అమాయక పారిశుధ్య కార్మిక మహిళల్ని పంపి పని చేయించడంతో గమనించిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విలువైన ప్రాణాల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, నిర్లక్ష్యం పనికిరాదని విమర్శలు చేస్తున్నారు. పారిశుధ్య కార్మిక విభాగ పెద్దలు గమనించి ప్రమాదం లేని చోట పనులు చేయించుకోవాల్సి ఉంది.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హామీలు అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని, తల్లికి వందనం పథకానికి కూటమి సర్కార్ ఈ విద్యా సంవత్సరానికి మంగళం పాడేసిందని మదనపల్లె నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శించారు. శుక్రవారం స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేబినెట్ సమావేశంలో 80 లక్షల మంది విద్యార్థుల తల్లులకు షాక్ ఇస్తూ వచ్చే ఏడాది ఆలోచిద్దామంటూ కేబినెట్ చేతులు దులుపుకోవడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఏడాది తల్లికి వందనం లేనట్లేనని తేలిపోయిందని, అధికారంలోకి రాగానే పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందేనన్నారు. విద్యా సంవత్సరం ముగిసిపోతున్నా తల్లికి వందనం పథకం అమలుపై కేబినెట్ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఎపిలో 80 లక్షల మందికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం ఇస్తామంటూ హామీ ఇవ్వగా, ఈ ఏడాది ఆ పథకానికి ఎగనామం పెట్టేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం కొలువుదీరి 6 నెలలు గడిచిపోయినా 6 గ్యారెంటీలు కూడా అమలు చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. వైసిపి ప్రభుతం అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రతి నెలా సంక్షేమ కేలండర్ అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. మెగా డిఎస్సీ ద్వారా 24 వేల టీచర్ పోస్టులు అందిస్తామని ప్రకటించి నిరుద్యోగులలో ఆశలు రేపి, ఇప్పటి వరకు డిఎస్సీ ప్రకటించక పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైన డిఎస్సీ ప్రకటించి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మదనపల్లి పట్టణంలో రద్దీగా ఉండే సబ్ రిజిస్టర్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-రాయచోటి : మండలంలోని కాటిమాయకుంట గ్రామం, రెడ్డివారిపల్లిలో తాగేనీటి సమస్య పరిష్కారానికి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి శుక్రవారం నూతన బోర్ ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్య చేపట్టామన్నారు. ప్రతి గ్రామంలో నూతన బోర్లు వేసి మోటార్లు బిగించి గ్రామాలకు నీటి సరఫరా చేశామన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండ భాస్కర్‌రెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పీలేరు:మండలంలోని కాకులారంపల్లి పంచాయితీ, ఇందిరమ్మ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు దళవాయి సురేష్ కుమార్‌రెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలోని కోదండ రాముని ఆలయ ప్రాంగణంలో శనివారం తిరుపతికి చెందిన రమాదేవి సూపర్ స్పెషాలిటీ మల్టీ హాస్పిటల్ వైద్య బృందం వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. జనవరి 4 శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం రెండు వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

బయనపల్లి గ్రామస్తులతో కెకె చౌదరి

కెకె.చౌదరికి ఘన సన్మానం

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కెకె చౌదరిని మండల పరిధిలోని ఓబునపల్లె పంచాయితీ బయనపల్లె గ్రామస్తులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రముఖ దేవాలయం శ్రీ కోదండ రామస్వామిని చైర్మన్ కెకె చౌదరి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా చిన్నప్పటి నుంచి బయనపల్లి కోదండ రామస్వామి ఆలయాన్ని దర్శిస్తున్నానని చైర్మన్ హోదాలో ఆ స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.బయనపల్లి గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు.

ఎసిటిఒ కృష్ణమోహన్‌రెడ్డి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

కృష్ణమోహన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సోదరుడు ప్రభాకర్‌రెడ్డి కుమారుడు కడప సర్కిల్-2లో ఎసిటిఒగా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి(50) గురువారం ఆనారోగ్యంతో మృతి చెందారు. గతంలో ఎన్‌జిఒ సంఘం కోశాధికారిగా పనిచేశారని తెలిపారు. ఆయన మృతి తమ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నిపిందని అన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు ముక్కా వారిపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ముక్కా మధుసూదన్‌రెడ్డి, ముక్కా ప్రభాకర్‌రెడ్డి, రూపానందరెడ్డి తెలిపారు.

ఆలిండియా క్యారమ్ పోటీలకు అంపైర్‌గా కృష్ణయ్య

ప్రజాశక్తి-నందలూరు

నెల్లూరులో జనవరి 5 నుంచి 8 వరకు జరిగే అల్ ఇండియా క్యారమ్ పోటీలకు అంపైర్‌గా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచే యుచున్న సురే కృష్ణయ్య ఎంపికైనట్లు ఎపి స్టేట్ క్యారం అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎస్‌కె.జలీల్, కడప జిల్లా క్యారమ్స్ చైర్మన్ పోలంకి గణేష్ తెలిపారు. మొట్ట మొద టిసారిగా ఉమ్మడి కడప జిల్లా నుంచి జాతీయ క్యారం ఎంపైర్‌గా ఎంపిక కావడం జిల్లాకు, క్యారం సంఘానికి గర్వకార ణమని అన్నారు.ఉపాధ్యాయులు కృష్ణయ్యను అభినందిస్తూ, ఉత్సాహాన్ని వ్యక్తపరిచారు.

క్రికెట్ కిట్ అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి-వీరబల్లి

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేసినట్లు టిడిపి నాయకులు తాటికుంట్ల శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ జట్టుకు ఆయన స్వగృహంలో అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడాకారులుగా ఎదిగి గ్రామం, మండలం తోపాటు నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులు శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో ఈనెల 5,6,7,8 తేదీలలో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సివి.రమణమూర్తి తెలిపారు. రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రిక, కరపత్రాలను మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్‌రాజు, నాగ తిరుమల రావు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి ఉపాధ్యాయులకు దిక్సూచిగా పనిచేస్తున్న సంఘం యుటిఎఫ్ అని అన్నారు. అప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ప్రభుత్వ బడుల బలోపేతానికి యుటిఎఫ్ పనిచేస్తుందన్నారు. యుటిఎఫ్ ప్రభుత్వ విద్యారంగానికి ఉపాధ్యాయులు సంక్షేమానికి కృషిని సమీక్షించుకొని రాబోయే 25 సంవత్సరాలు ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకోవడానికి ప్రభుత్వ బడుల బలోపేతం కోసం ఈ స్వర్ణోత్సవ మహాసభలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం జిఒ117 రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలను ఒకటి నుంచి ఐదవ తరగతుల వరకు కొనసాగించాలన్నారు. సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు పి.సాంబశివరావు, ఎస్‌వి రమణ, కె.శంకరయ్య, వరదారెడ్డి పాల్గొన్నారు.

రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి

ప్రజాశక్తి -గోపవరం : రైతులు ఎరువలు, పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా దుకాణదారుల నుంచి తప్పని సరిగా రసీదు తీసుకోవాలని వ్యవసాయ సంచాలకులు నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీ ఠాగూర్ ఆగ్రో కెమికల్స్, పెస్టిసైడ్ అండ్ సీడ్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల రిజిస్టరులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ధరల పట్టిక, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్‌లు, లైసెన్సు గడు వు తదిత రాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు కోనుగోలు చేసే సమయంలో రైతు లకు డీలర్, రైతుల సంత కాలతో కూడిన రసీదులు తప్ప కుండా ఇవ్వాలని ఆదేశిం చారు. గడువు ముగిసిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మరాదని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మా త్రమే గరిష్ట ధరకు లోబడి విక్రయించాలన్నారు. ట్రేడ్ శాంపిల్స్ కేటగిరి కింద శాంపిల్స్ బద్వేల్ మార్కెట్ యార్డు లోని సమగ్ర నాణ్యత పరీక్ష కేంద్రంలో ఎరువులు, విత్తనాలు నిర్దేశిత రుసుం చెల్లించి నాణ్యత పరీక్ష చేయించుకోవాలన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA SRI SATHYA SAI DIST

E.A.No.40/2023 in E.P.No.1/2013 in O.S.35/1992

Between:
Rangamma Died by Lrs Kamsala Rajeshwari and Others ...Petitioner
And
Saradamma & Others ...Respondents

Notice to Respondents 4 to 7

4.M.V.Jyothi, W/o.M.V.Thulasiram
5.M.V.Thrilochana, W/o.Nagachari
6.M.V.Gayathri, W/o.Karthik
7.M.V.Bindu, D/o.M.V.Thulasiram
4 to 7 Residing at Kodumur village and Mandal, Annamayya District.

పై దావా E.P.No.1/2013లో లోని వాది రంగమ్మ చనిపోయినందువలన ఆమె వారసులుగా పైదావాలో వాదులను మరియు మిమ్ములను చేర్చుటకుగాను E.A.No.40/2023 గా పిటీషన్ దాఖలు చేయడం జరిగింది. ఆ పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తమై **9-1-2025**కు వాయిదా వున్నది. కావున ఆరోజు మీరు ఖుద్దున కాని, వకీలు ద్వారా కాని, పైకోర్టులో ఉదయం 10.30 గంటలకు హాజరు కావలయును. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మానించబడును.

యల్.విశ్వనాథ్
అడ్వకేట్, పెనుకొండ.

సావిత్రి బాయి పూలే ఆదర్శప్రాయులు

కలకడ: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పీలేరు : సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి-కలకడ

సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించినట్లు ప్రధానో పాధ్యాయులు మోడం చంగల్‌రాయుడు, ప్రిన్సిపల్ మలంగ్ షావలి పేర్కొన్నారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల విద్యాభ్యాసం కోసం సావిత్రిబాయిపూలే మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. విరాళాలు సేకరించి అందరికీ మధ్యా హ్నం భోజనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారని, సమాజంలో రుగ్మతలను తొలగించడానికి తన భర్త జ్యోతిరావుపూలేతో కలిసి కృషి చేశారు. మొదట భర్త దగ్గర విద్య నేర్చుకుని తనే ఉపాధ్యాయినిగా మారి ఎందరో మహిళలకు విద్య నేర్పించి మహిళల్లో విద్యాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. విద్యార్థులు అందరూ కూడా పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలువాతో సన్మానించి చిరు కానుకలను అందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కరుణాకర్, మహేశ్వరి, నాగమునీ నాయక్, రమేష్ కుమార్‌రెడ్డి, రెడ్డప్ప, గఫార్ ఖాన్, సైరాబాను, ఝాన్సీ రాణి, కిరణ్ కుమార్, శ్రీదేవి పాల్గొన్నారు. **రాయచోటి :** బాలికలు చదువు కొంటేనే సమ సమాజం సాధ్యం అవుతుందని నమ్మి ఆ సిద్ధాంత సాఫల్యం కొరకు చివరి శ్వాస వరకు పోరాడిన ఉద్యమరాలు అని, మొదటి మహిళ ఉపాధ్యాయుని కూడా సావిత్రిబాయిపూలే అని అలిమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్.జాబిర్ పేర్కొన్నారు. సావిత్రి బాయి పూలే జయంతిని అలిమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.బాలికలు శూద్రులు, వెనుకబడిన కులాల మాహిళలు చదవకూడదు అని కట్టు బాట్ల సమాజంలో ఎన్నో వేధింపులను భరించి ధైర్యంగా చదువు కొనసాగించ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో ఇలియాస్, మొహమ్మద్ బాషా, జయన్న నాయక్, ఇందాద్, జగదీశ్, నరస రాజు, చాన్ బాషా, రాజా బాబు, అబ్దుల్, లతీఫ్, రహమతుల్లా పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని ఎంఆర్‌సిలో ఎస్‌టియు ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు జి.చక్రధర్‌రాజు, డి.నాగతిరుమలరావు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎస్‌టియు మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. సమావేశ ప్రారంభంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బుదారపు నరేంద్రనాథ్, జిల్లా కౌన్సిలర్ ఎం. ప్రసాద్‌రెడ్డి సంస్కృత పాఠశాల హెచ్‌ఎం వరదారెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ పాల్గొన్నారు. **దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..**మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి ఆమ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇలాంటివారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజ హిత పనులు చేయాలని పేర్కొన్నారు. **రాజంపేట అర్బన్ :** సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి అని ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి అన్నారు. సావిత్రిబాయిపూలే జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని సీతారామపురం పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు మాసా వెంకటసుబ్బమ్మను ఎస్‌టియు రీజనల్ కన్వీనర్ నరసింహులు ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాజంపేట మండల ఆర్థిక కార్యదర్శి శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు నరసయ్య, విద్యా కమిటీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే ఆధునిక భారత తొలి మహిళా టీచర్ అని, ఆమె 194వ జయంతి వేడుకల్లో బాస్ నేతలు కొనియాడారు. స్థానిక బాస్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ అంబేద్కర్ సేన(బాస్) ఆధ్వర్యంలోసావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ మాటాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయినిగా, ఉద్యమకారిణిగా, రచయిత్రిగా, సంఘసంస్కర్తగా సావిత్రిబాయి పూలే దేశానికి చేసిన బహుముఖ సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు బి. గంగులమ్మ, వీసీకే, బాస్ నాయకులు చాట్ల బయన్న, తలారికృష్ణ, రెడ్డిప్రసాద్, క్రాంతి, గంగాధర్, వై.చిన్నా, ఇర్ఫాన్, మురళి, తరుణ్ పాల్గొన్నారు. **రామసముద్రం :** సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి అని యుటియఫ్ జిల్లా కార్యదర్శి హేమలత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు రాణించాలని సూచించారు. మహిళల విద్యాభ్యాసం కోసం సావిత్రి బాయ్ పూలే మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు అందరూ కూడా పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. **పీలేరు:** మనుస్మృతి అమలు చేసిన దుర్మార్గమైన చట్టాలను మంటలకు ఆహుతి చేసిన క్రాంతి జ్యోతి, ఆధునిక భారత మహిళ, తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్ తెలిపారు. సావిత్రిబాయి పూలే194వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని ముడుపులవేముల పంచా యితీ, విద్యానగర్‌లో బాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి మహిళలతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు పల్లిపోగు హరి నాథ, నాగేశ్వరరావు, ముల్లంగి గురవయ్య, మాల మహానాడు నాయకులు కె. గట్టప్ప, జెట్టి మల్లికార్జున, దుర్గాప్రసాద పాల్గొన్నారు. **బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో..** మహిళల అక్షరాస్యత సాధన కోసం పోరాడిన మొదటి మహిళా ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినంగా ప్రభుత్వం ప్రకటించాలని బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బలరాం (కన్నా), రామయ్య, లక్ష్మయ్య, చంద్రకళ, బీబిజాన్, ప్రవీణ్, షణ్ముగం, రెడ్డి ఖాన్, రోశయ్య పాల్గొన్నారు. **మండల వనరుల కేంద్రంలో..** మహిళా విద్య ఉద్యమ నాయ కురాలు సావిత్రిబాయి పూలే కృషి ఖ్యాతి చిరస్మరణీయమని పీలేరు మండల విద్యాశాఖ అధికారులు వై. లోకేశ్వర్ రెడ్డి, పద్మావతమ్మ తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. **వాల్మీకిపురం:** తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త, బడుగుల విద్యాజ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ పూలే దంపతులు తమ జీవితాన్ని పూర్తిగా అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి, సామాజిక చైతన్యం కోసమే త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామంజుల, అధ్యాపకులు లోకనాథం, ఖాజాబి, బాబాజాన్, హుస్సేన్, రెడ్డెమ్మ, విద్యార్థులు, పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మికి సావిత్రిబాయి పూలే స్మారక పురస్కారం

మదనపల్లె అర్బన్: పట్టణం సమీపంలోని అమ్మచెరువుమిట్టలో గల వెలుగు సంస్థ కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మికి సావిత్రిబాయిపూలే స్మారక పురస్కారం దక్కింది. సావిత్రీబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకుని మదనపల్లి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే స్మారక పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఇందులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, సావిత్రీ బాయి స్మారక అవార్డు ను అందుకున్నారు. సందర్భంగా ఆమె మాట్లా డుతూ మహిళా లోకానికి విద్యా దారిని చూపిన సావిత్రిబాయి పూలే జయంతి రోజున స్మారక పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగా ల్లో రాణించి తమ సత్తా చాటాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మికి పట్టణంలోని ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న భాగ్యలక్ష్మి

మోసగించడం భావ్యమా : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం తల్లులను, బడి పిల్లలను, రైతన్నలను మోసగించడం భావ్యం కాదని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికలలో టిడిపి కూటమి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం సూపర్ సిక్స్ హామీలు అన్నారు. అందులో ప్రధానమైంది తల్లికి వందనం పథకమని చెప్పారు. ఈ పథకం కింద స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో 45 లక్షల మంది తల్లులు, 83 లక్షల మంది బడి పిల్లలు ఉన్నారని తెలిపారు. ఏడాదికి రూ 12,450 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు పైసా ఇవ్వలేదని తెలిపారు. ఈ ఎడాది ఇవ్వలేమని వచ్చే ఏడాది నుంచి ఇవ్వాలని ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని అయితే ఈ నిర్ణయం మాట తప్పడమే అవుతుందని అన్నారు. తల్లికి వందనం కాదు - తల్లికి మోసం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. అన్న దాత సుఖీ భవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ 20,000 ఆర్థిక సా యం చేస్తామని టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని చెప్పారు. అయితే ఇప్పటివరకు పైసా సహాయం చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వాలకం చూస్తుంటే ఈ ఎడాదిలో పథకానికి చేతులు ఎత్తేసినట్లే ఉందని అన్నారు. రాష్ట్రంలో 53.52 లక్షల రైతు కుటుం బాలున్నాయని వారందరూ మోసం పోయారని చెప్పారు. ప్రభుత్వం పునరా లోచించి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీ భవ పథకాలను ఈ ఆర్థిక సంవత్సరం లోనే అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, మహబూబ్ బాషా, రమణ, నాగరాజు, రవి, వేమా రాజా, మదార్, వేమయ్య, బద్రి, సుబ్బరాయుడు, వినయ్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ట్రిపుల్‌ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె :రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్‌ఐ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటిలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పవర్ లిఫ్టింగ్ కోచ్ గోవిందు తివారీ చెప్పారు. శుక్రవారం పవర్ లిఫ్టింగ్ లో ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, ఎఒ రవికుమార్ అభినందించారు. పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి చెందిన పియుసి - 2 విద్యార్థి మహబూబ్ తమ ప్రతిభను చాటా డని చెప్పారు. శివ కుమార్, వైష్ణవి అనే విద్యార్థులు కూడా పవర్ లిఫ్టింగ్‌లో రాణించి బంగారు పతకం సాధించారని తెలిపారు. ఒంగోలు క్యాంప స్‌లోని పియుసి - 2 కు చెందిన తేజస్విని, చందన కూడా ప్రతిభ చాటి పత కాలను కైవసం చేసుకున్నారన్నారు. పవర్ లిఫ్టింగ్ పోటీలు విజయవాడలోని కృష్ణ లంకలోని జూనియర్ కళాశాలలో జరిగినట్లు చెప్పారు.

విజయానంద్‌కు రుణపడి ఉంటాం

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

ఎస్. ఉప్పలపాడు గ్రామాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ ఆదర్శ గ్రామంగా నిలిపిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు రుణపడి ఉంటామని మాజీ టి బి హెచ్‌ఎల్‌సి చైర్మన్, ఉప్పలపాడు గ్రామ సీనియర్ నాయకులు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా కె.విజయానంద్ ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఉప్పలపాడు గ్రామస్తులు కృతజ్ఞతగా విజయానంద్ చిత్రపటాన్ని గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 2015లో విజయానంద్ తమ గ్రామాన్ని దత్తత తీసుకొని, గ్రామ పెద్దలు మాయలూరి రామ మనోహర్‌రెడ్డితో కలిసి గ్రామంలో నీరు చెట్టు పథకం, ప్రతి ఇంటికి మరుగుదొడ్ల అభివృద్ధి, సిమెంట్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, అంగన్వాడీ సెంటర్లు, వైద్య క్లినిక్ తదితర అన్ని రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. 2019 ఫిబ్రవరి 19న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా తమ గ్రామానికి రాష్ట్రంలోనే ఉత్తమ ఆదర్శ గ్రామంగా అవార్డు అందజేశారన్నారు. ఈ ఘనత ప్రభుత్వ సిఎస్ విజయా నంద్‌కు దక్కుతుందని చెప్పారు. విజయానంద్ మరెన్నో అత్యున్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని గ్రామ ప్రజలు కోరుతు న్నామన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయం, ప్రభుత్వాసుపత్రి, వివిధ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగైనా వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎంపిపి లక్ష్మమయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలు ఆలస్యం అవుతుండడంతో వ్యవసాయం రైతులు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్. ఓబాయపల్లె సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నియామకానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కెసి కెనాల్‌కు రెండవ కారు సాగు చేసేందుకు నీటిని విడుదల చేయడంపై స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని తెలిపారు. అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీర కిషోర్. డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి శుభకరుణమ్మ ఎంఇఒ రవిశంకర్ పాల్గొన్నారు.

రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న రామాంజనేయులు

ఎబిసిడి వర్గీకరణ చేయాలి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-రాయచోటి

ఎబిసిడి ఎస్‌సి వర్గీకరణ చేసి మాదిగల అభ్యున్నతి తోడ్పాడలని ఎంపిఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు ఎస్.రామాంజనేయులు నేతృత్వంలో ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిబాబు, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు బసయ్యలు ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకి వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ కొరకు ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజేష్ రంజన్ మిశ్రా రాష్ట్ర పర్యటనలో భాగంగా కడప కలెక్టర్ కార్యాలయంలోని క్యాంప్ ఆఫీస్‌లో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఆర్‌పిఎస్ తరపున వినతి పత్రం సమర్పించి తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని కోరారు. ఎస్‌సిలలో ఉండబడిన 59 కులాలకు వారి వారి జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ ఆర్థిక సంక్షేమ రంగాలలో లబ్ధి పొందే విధంగా ఎబిసిడిలుగా వర్గీకరణ చేయాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటాలు గౌరవించి సిఎం చంద్రబాబు ఏక సభ్య కమిషన్ వేసి వర్గీకరణ కనుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ న్నామని అన్నారు. గతంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో నియమించిన జస్టిస్ రామచంద్రాజ్ కమిషన్, ఉషామెహ్రా కమిషన్ వారు రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకుని ఎస్‌సి వర్గీకరణను ఎబిసి డిలుగా విభజించమని సిఫారసు చేశారే కాని జిల్లాను యూనిట్‌గా చేసి వర్గీక రించమని ప్రస్తావించలేద న్నారు. గతంలో అమలు చేసిన ఎబిసిడిల నుంచి డి ని విస్మరించడం సబబు కాదని అలా చేయడంవల్ల కనీస ప్రామాణిక స్థాయిలో జనాభా లేని కొన్ని ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందవని తెలిపారు. రాష్ట్రాన్ని యూనిట్ గా పరిగణించాలని, గతంలో వలే ఎబిసిడిలుగా వర్గీకరించాలని వారు కమిషన్ కి విన్నవించారు. **లక్కిరెడ్డిపల్లి :** ఎబిసిడిలుగా ఎస్సీ వర్గీకరణ చేపట్టడంతో పాటు ఎస్సీలకు విద్యా,ఉద్యోగ,ఆర్థిక,రాజకీయ రంగాలలో ప్రాధాన్యత కల్పించాలని అన్నమయ్య జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండకింద మనోహర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ కోసం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ రాజేష్ రంజని మిశ్రా రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం కడప జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా బండ కింద మనోహర్ ఆధ్వర్యంలో ఎస్సీ నేతలు వినతి పత్రం సమర్పించి,తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలలో ఉన్న 59 కులాలకు వారి వారి జనాభా దామాషా ప్రకారం విద్యా,ఉద్యోగ,రాజకీయ,ఆర్థిక సంక్షేమ రంగాలలో లబ్ధి పొందే విధంగా ఎబిసిడి లుగా వర్గీకరణ చేయాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-వీరబల్లి

క్రీడలతోనే శారీరకంగా మానసికంగా ఉల్లాసం స్నేహభావం పెంపొందు తుందని కడప లివింగ్ డయాగ్నొస్టిక్ ఎండి గాలివీటి వివేకరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రామకృష్ణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వివేక్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించే క్రికెట్ పోటీలను ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులు క్రికెట్ పోటీలను గెలుపోటములను సహజంగా తీసుకొని క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు.యువకులు చదువుతో పాటు క్రీడలపై కూడా మక్కువ చూపాలని అన్నారు. ఈ క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి, రూ .30వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్ర రెడ్డి, కళాశాల అధ్యాపకులు భాస్కర్, రాజు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వివేక్‌రెడ్డి

క్రైం కార్నర్

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో వెలుగు చూసింది. ఘటనపై మృతుని కుటుంబ సభ్యులు, ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంగళ్లు గ్రామం చేనేతనగర్‌లో నివాసముంటున్న ట్రాక్టర్ డ్రైవర్ నారాయణ(50) తన ఇంట్లోనే బెడ్ రూమ్‌లోకి వెళ్లి మోల్డింగ్ కమ్మీకి తాడుతో ఉరి వేసుకున్నాడు. గమనించిన భార్య లక్ష్మీదేవి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఉరి నుంచి నారా యణను తప్పించారు. అప్పటికే అతను మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలు తెలియ రాలేదని, కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ తెలిపారు.

మిద్దె పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిద్దె పైనుంచి పడి ఓ భవన కార్మికుడు మృత్యువాత పడ్డాడు. నిమ్మనపల్లె ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, కట్టుబావి గొల్లపల్లి దళితవాడకు చెందిన భవన కార్మికుడు వెంకటరమణ(40) నిమ్మనపల్లె మండలంలోని బండ్లపై గ్రామంలో నూతన ఇంటిని నిర్మించే కాంట్రాక్ట్ ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పనులు చేస్తుండగా ప్రమాద వశాత్తు మిద్దె పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన సమాచారం అందుకున్న నిమ్మనపల్లి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య గంగాదేవి ఉంది. వెంకట్రమణ మృతితో కట్టు బావిగొల్లపల్లె దళితవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గాయపడిన రైతు పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిద్దె పైనుంచి పడిన ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వాల్మీకిపురం పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన రైతు రెడ్డిప్రసాద్ మిద్దెపై ఉన్న వాటర్ ట్యాంకులో వృధాగా పోతున్న నీటిని ఆపేందుకు పైకి ఎక్కాడు. ప్రమాద వశాత్తు అక్కడి నుండి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబీకులు క్షతగాత్రుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.